సాక్షి కామారెడ్డి

సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



క్రీడలతో మానసికోల్లాసం

ఆటలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు.

- 8లో ▸



వాహనాల తనిఖీ

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.4 /20.7

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నేతలు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా 32వ వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్ నేత అనూష మాడూరి ఆ పార్టీని వీడారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో కౌన్సిలర్ అనూష భర్త ప్రసన్న కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తా'



కామారెడ్డి టౌన్: రాజకీయాల్లో మార్పు కోసం జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు గుడిమెట్ మహాదేవ ఆలయ పీఠాధిపతి మహాదేవ్ స్వామీజీ తెలిపారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం స్వార్థ రాజకీయాల కోసం తప్ప ప్రజల సంక్షేమం కోసం పనిచేసే నాయకులు లేరన్నారు. ఆస్తులు కూడబెట్టుకోవడానికే రాజకీయాల్లోకి వస్తున్నారే తప్ప ప్రజా సేవ చేయడం లేదని పేర్కొన్నారు. ఆధ్యాత్మికం ద్వారా ఇప్పటికే ప్రజల్లో ఉన్నానని, ఇక ధర్మ పాలన కోసం రాజకీయాల్లోకి అడుగు పెట్టాలని నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు. ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండలంలోని పెద్ద తడ్గూర్ ఎంపీటీసీ మధురబాయి, నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌పార్టీ పేద ప్రజల, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కుంటు పడిందని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి అవసరం ఉన్న నిధులు విడుదల చేస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో మైనార్టీ ముఖ్య నాయకుడు జావీద్ పటేల్ ఇంటికి ఎమ్మెల్యే వెళ్లారు. ఎమ్మెల్యేకు జావీద్ పటేల్ విందు ఏర్పాటు చేశారు.



మర్కల్ - తిర్మన్‌పల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతలు

గతుకుల రోడ్లపై అవస్థలు

- అధ్వానంగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే దారులు
- నిర్వహణ లేక రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి, కామారెడ్డి : గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు గతుకులమయంగా మారడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తారు తేలి గుంతలుగా మారిన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఆ రోడ్లపై వెళ్లడానికి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అన్ని రోడ్లు కలిపి 924 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. రోడ్లు భవనాల శాఖ పరిధిలోనే ఎక్కువ శాతం రోడ్లు ఉన్నాయి. సమస్య ఎక్కువ ఎక్కడ ఉందో గుర్తించకుండా కాంట్రాక్టర్లు సూచించిన రోడ్లకే మెయింటెనెన్స్ కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నారు. దీంతో చాలా ప్రాంతాల రోడ్లకు అన్యాయం జరుగుతోంది. కనీసం ప్యాచ్‌వర్క్‌లు కూడా చేయడం లేదు. కామారెడ్డి పట్టణం నుంచి ఉప్పల్‌వాయికి వెళ్లే రహదారిపై అడ్లూర్ - పోసానిపేట మధ్య ఏర్పడిన గుంత ప్రాణాంతకంగా మారింది. గుంతను తప్పించే వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొడుతున్నారు. గుంత నుంచి వాహనాలను తీస్తే పడిపోతున్నారు. అలాగే మర్కల్-తిర్మన్‌పల్లి రోడ్డులో కూడా తారు తేలిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాన్సువాడ ప్రాంతంలో బుడ్మి నుంచి కొత్తబాది వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. బీర్కూర్-మీర్జాపూర్, బైరాపూర్-నస్రుల్లాబాద్ మార్గంలో గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జుక్కల్ చౌరస్తా నుంచి జుక్కల్ మండల కేంద్రం వరకు రోడ్డు పనులు అసంపూర్తిగా మిగిలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మద్దెల చెరువు నుంచి బిచ్కుంద మధ్య రోడ్డు అధ్వానంగా తయారైంది. బాన్సువాడ-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మొగులాన్‌పల్లి, కొత్తబాది గ్రామాల వద్ద పలుచోట్ల గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఇసన్నపల్లి నుంచి మద్దికుంట వెళ్లే రోడ్డుపై గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గాంధారి నుంచి దుర్గం, గాంధారి నుంచి గుర్జాల్ రోడ్డుపై గుంతలు ఇబ్బందికరంగా మారాయి. కామారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రాల మధ్య రాజంపేట మీదుగా ఉన్న రోడ్డుపై కొండాపూర్, ఆర్గొండ గ్రామాల పరిధిలో గుంతలు, మూలమలుపులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మద్నూర్ మండలంలోని కొడిచెర, పెద్ద ఎక్లారా, రాచూర్, సోమూర్, ఇలేగావ్ రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు.

మరమ్మతులు కరువు..

గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లపై ఏర్పడిన గుంతలకు కనీసం ప్యాచ్ వర్క్ ద్వారా తాత్కాలిక ఉపశమనం కలిగించాలి. కానీ అధికారులు వాటి సంగతిని పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, వారికి సంబంధించిన గుత్తేదారులు సూచించిన వాటికే ఎస్టిమేట్లు చేస్తూ, ప్రధాన సమస్యలను పక్కన పెట్టేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో రోడ్లు భవనాల శాఖ ఆధీనంలో గ్యాంగ్‌మెన్లు ఉండేవారు. రోడ్లపై గుంతలు పడితే ప్యాచ్ వర్క్‌లు వాళ్లే చేసేవారు. కనీసం మట్టి పోసి అయినా తాత్కాలికంగా ఇబ్బందులు తొలగించేవారు. రిటైర్మెంట్లు తప్ప, కొత్తగా గ్యాంగ్ మెన్ల నియామకాలు లేకపోవడంతో రోడ్ల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లపై గుంతలను పూడ్చివేయించాలని ప్రజలు కోరుతున్నారు.



ఉప్పల్‌వాయి-కామారెడ్డి రోడ్డుపై గుంత

వరదలతో దెబ్బతింటున్న రోడ్లు

వర్షాకాలంలో వరద రోడ్లపై పారడంతో చాలా రోడ్లు దెబ్బతింటున్నాయి. దీనికి తోడు కేజీవీల్స్ ట్రాక్టర్లు నడవడం మూలంగా రహదారులు డ్యామేజీ అవుతున్నాయి. వరదలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించి వాటికి నిధులు సాధించడంలో ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు సూచించిన రోడ్లకు ఎస్టిమేట్లు వేసి పంపడంతో చాలా రోడ్లకు అన్యాయం జరుగుతోంది. బాగున్న రోడ్లకే మళ్లీ మళ్లీ మరమ్మతులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గుంతలమయంగా మారిన రోడ్ల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు వచ్చినా, సమస్య ఉన్నచోట పనులు జరపడం లేదన్న విమర్శలున్నాయి.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

బాల్కొండ: యాసంగి సీజన్‌లో ఆయకట్టుకు చివరి తడిగా కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. మూడు రోజులుగా కాలువల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. రోజుకు 0.4 టీఎంసీల చొప్పున ఇది వరకే 1.2 టీఎంసీల నీరు ఖాళీ అయింది. కాకతీయ కాలువ ద్వారా ఐదు వేల క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 271 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091 (90 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1,058.30 (11.4టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.



ఎస్సారెస్పీలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

బల్దియా హస్తగతమయ్యేనా!

- నేడు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- క్యాంపు నుంచి నేరుగా కార్యాలయానికి చేరుకోనున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు
- అవిశ్వాసంపై నేడు హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఉత్కంఠ



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికను సోమవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సంఖ్యాబలం ఉన్నా.. పార్టీనుంచి ఇద్దరు కౌన్సిలర్లు చైర్‌పర్సన్ స్థానాన్ని ఆశిస్తుండడంతో కాంగ్రెస్‌లో అయోమయం నెలకొంది. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీలు సైతం అధ్యక్ష పీఠం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. కాగా అవిశ్వాసాన్ని సవాల్ చేస్తూ మాజీ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ సోమవారమే జరగనుండడంతో ఉత్కంఠ నెలకొంది.

కాంగ్రెస్‌లో ఇద్దరు ఆశావహులు..

కామారెడ్డి బల్దియాలో 49 మంది కౌన్సిలర్లున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఓటు హక్కు కలిగి ఉన్నారు. చైర్‌పర్సన్ ఎన్నుకోవడానికి 26 మంది సభ్యులు అవసరం. కాంగ్రెస్‌కు 27 సభ్యులుండగా ఆదివారం 32వ వార్డు కౌన్సిలర్ మాడూరి అనూష బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం 28కి బలం చేరింది. రెండో వార్డు కౌన్సిలర్ సుతారి రవి మినహా మిగిలిన కౌన్సిలర్లు క్యాంపులో ఉన్నారు. వారంతా సోమవారం నేరుగా బల్దియాకు రానున్నారు. కాగా చైర్‌పర్సన్ స్థానాన్ని 10 వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనితతోపాటు వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ ఆశిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఒక్కో కౌన్సిలర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి అభిప్రాయాలు సేకరించినట్లు సమాచారం. పార్టీ అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తే వారికి మద్దతుగా నిలవాలని సూచించారని తెలుస్తోంది. అయితే వైస్ చైర్‌పర్సన్‌ను మెజారిటీ సభ్యులు వ్యతిరేకించినట్లు తెలిసింది. ఇందుప్రియకు అవకాశం ఇస్తే తాను మద్దతు ఇవ్వనని కాంగ్రెస్‌కు చెందిన రెండో వార్డు కౌన్సిలర్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఆయన కాంగ్రెస్ క్యాంపునకు కూడా వెళ్లలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఇందుప్రియకు అవకాశం కల్పిస్తే మిగిలిన సభ్యులు ఏ విధంగా స్పందిస్తారన్న అంశంపై ఆసక్తి నెలకొంది.

బీఆర్‌ఎస్, బీజేపీ ప్రయత్నాలు..

బీఆర్ఎస్ కౌన్సిలర్ అనూష ఆదివారం ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ బలం 15కు తగ్గిపోయింది. ఇందులోనూ రెండు గ్రూపులున్నాయి. మాజీ చైర్‌పర్సన్ వర్గంలో ఆరుగురు సభ్యులుండగా.. మరో వర్గంలో తొమ్మిది మంది ఉన్నారు. సంఖ్యాబలం లేకపోయినా ఆ పార్టీ చైర్‌పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. అయితే వైస్ చైర్‌పర్సన్‌ను అధ్యక్ష పీఠం ఎక్కించేందుకు బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు ముఖ్య నేతలు చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ పార్టీలో గందరగోళ పరిస్థితి నెలకొంది. మరోవైపు బీజేపీ సైతం బల్దియా అధ్యక్ష పీఠాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఆ పార్టీకి ఎమ్మెల్యేతో కలిపి ఏడు ఓట్లున్నాయి. కాంగ్రెస్‌లో వైస్ చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తున్న కౌన్సిలర్లతో బీజేపీ నేతలు టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు సభ్యులు సైతం బీజేపీకి మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. వారంతా మద్దతు ఇస్తే చైర్‌పర్సన్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కోర్టు తీర్పు ఎలా ఉంటుందో?

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసులోని పొరపాట్లు, అలాగే అవిశ్వాసం కోసం అధికారులు కౌన్సిలర్లకు జారీ చేసిన నోటీసుల్లో తప్పిదాలు ఉన్నాయని మాజీ చైర్‌పర్సన్ జాహ్నవి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం కోర్టులో వాదనలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పు ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

పట్టణంలో జోరుగా చర్చ

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎవరవుతారన్న అంశంపై పట్టణంలో జోరుగా చర్చ జరుగుతోంది. దీనిపై కొందరు బెట్టింగులకు పాల్పడుతున్నట్లు సమాచారం. కాగా సోమవారం నాటి సమావేశంలో కోరం లేకపోతే ఎన్నికను మంగళవారానికి వాయిదా వేయనున్నారు. మంగళవారం కూడా ఎన్నిక ప్రక్రియ పూర్తికాకపోతే వైస్ చైర్‌పర్సన్‌కు ఇన్‌చార్జి చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి.

'సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ పోరాడారు'

కామారెడ్డి క్రైం : సామాజిక న్యాయం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితాంతం పోరాడారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రజిత, అధికారులు బి సాయిలు, నాగరాజు, వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

సోషల్ ఇంజినీరింగ్!

- నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాల్లో ప్రధాన పార్టీల కసరత్తు
- కులాలు, వర్గాల వారీగా లెక్కలు వేసుకుని విడతలవారీగా సమ్మేళనాలు
- గంపగుత్తగా ఓట్లు రాబట్టుకునేందుకు అభ్యర్థుల పాట్లు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జహీరాబాద్, నిజామాబాద్ పార్లమెంట్ స్థానాలలో ఎంపీలుగా బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇక్కడి పరిస్థితులకు తగినట్లుగా ప్రచారపర్వంలో సోషల్ ఇంజినీరింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. కులాలు, వర్గాల వారీగా లెక్కలు వేసుకుని ఆయా శాసనసభ సెగ్మెంట్లలో బూత్‌ల వారీగా ఉన్న ఓట్ల లెక్కల ఆధారంగా గంపగుత్తగా ఓట్లు వేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అభ్యర్థులు ప్రచారపర్వంలో కులసంఘాల ద్వారా ఆయా వర్గాల ఓట్లకు గాలం వేసే కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

■ కర్ణాటకకు ఆనుకుని ఉన్న జహీరాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో సంగారెడ్డి జిల్లాలోని నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్, అందోల్, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న సురేష్ షెట్కార్, బీజేపీ నుంచి బరిలో ఉన్న సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌లు ఇద్దరు లింగాయత్ సామాజిక వర్గం వారు కాగా, బీఆర్ఎస్ తరపున బరిలో నిలిచిన గాలి అనిల్‌కుమార్ మున్నూరుకాపు కులానికి చెందినవారు. అయితే ఈ స్థానంలో లింగాయత్, మున్నూరుకాపు, ముదిరాజ్ కులాల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. తర్వాత ఎస్సీ, పద్మశాలి, ముస్లిం, యాదవ, గౌడ్, రెడ్డి, వైశ్య కులాల ఓట్లు ఉన్నాయి. కాగా నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్, జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్లలో లింగాయత్ ఓట్లు భారీగా ఉన్నాయి. తర్వాత మున్నూరుకాపు ఓటర్ల విషయానికి వస్తే ఏడు సెగ్మెంట్లలో గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ముదిరాజ్, ముస్లిం ఓట్లు సైతం అన్ని సెగ్మెంట్లలో ఎక్కువగానే ఉన్నాయి. ప్రతి సెగ్మెంట్‌లో చెప్పుకోదగిన స్థాయిలో పద్మశాలి, ఎస్సీ, యాదవ, గౌడ్ కులాల ఓట్లు ఉన్నాయి. ఇక కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో కొన్నిచోట్ల వైశ్య సామాజిక వర్గం ఓట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ కులాల ఓట్ల లెక్కలను దగ్గర పెట్టుకుని బూత్‌ల వారీగా వివరాలు సేకరించుకుని ఆయా కులసంఘాలతో సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలను అభ్యర్థులు నిర్వహిస్తున్నారు. అయితే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు సురేష్ షెట్కార్, బీబీ పాటిల్ ఒకే సామాజిక వర్గం వారు కావడంతో లింగాయత్‌లు ఎటువైపు మొగ్గు చూపుతారన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది.

■ మహారాష్ట్రను ఆనుకుని ఉన్న నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధి జగిత్యాల వరకు ఉంది. నిజామాబాద్ జిల్లాలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బాల్కొండ, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల శాసనసభ సెగ్మెంట్లు ఉన్నాయి. ఈ స్థానంలో బరిలో ఉన్న బీజేపీ సిట్టింగ్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌లు మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందినవారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి రెడ్డి కులానికి చెందినవారు. ఈ పార్లమెంట్ పరిధిలోని అన్ని శాసనసభ సెగ్మెంట్లలో మున్నూరుకాపు, ముస్లిం, పద్మశాలి ఓట్లు గణనీయంగా ఉన్నాయి. తర్వాత ముదిరాజ్, రెడ్డి, యాదవ్, గౌడ్‌ల ఓట్లు చెప్పుకోదగిన స్థాయిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు అర్వింద్, బాజిరెడ్డి గోవర్ధన్‌లు ఇద్దరూ మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందినవారు కావడంతో సదరు కులం ఓటర్లలో చీలిక ఏ మేరకు ఉంటుందనే విషయమై కచ్చితమైన అంచనాలు రావడం లేదు.

■ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాల ఓట్లు గణనీయ స్థాయిలో ఉన్నాయి. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోనూ కొంతమేరకు గల్ఫ్ కార్మిక కుటుంబాల ఓట్లు ఉన్నాయి. దీంతో గల్ఫ్ కుటుంబాల ఓట్ల కోసం ప్రధాన పార్టీలు గాలం వేసే పనిలో పడ్డాయి. ఇందులో భాగంగా ఆదివారం దుబాయ్‌లో గల్ఫ్ కార్మికులతో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఇంటరాక్ట్ అయ్యారు. నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి జూమ్ మీటింగ్‌లో గల్ఫ్ కార్మికులతో మాట్లాడారు. మరోవైపు ఈ నెల 21వ తేదీన బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు రాణిరుద్రమ దుబాయ్‌లో గల్ఫ్ కార్మికులతో సమావేశం నిర్వహించనున్నారు.

'మౌలిక వసతులు కల్పించాలి'

రాజంపేట: వరి కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఆదివారం ఆయన రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం, గన్ని సంచుల సరఫరా, తాగునీరు వంటి మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులు ధాన్యం విక్రయించిన వెంటనే పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, సెల్‌ఫోన్ నంబర్ వివరాలు అందించాలన్నారు. మట్టి కుండలలో తాగునీటిని అందుబాటులో ఉంచాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, సివిల్ సప్లైస్ అధికారి శ్రీనివాస్, మానిటరింగ్ అధికారి మమత, సీఈవో సాయిలు, ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.



కొండాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఇజ్రాయెల్‌లో మనోళ్లు సేఫ్

- తాము క్షేమమేనంటూ సమాచారమిస్తున్న తెలంగాణ వాళ్లు
- ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం ఆగినట్లు వార్తలు
- అయినప్పటికీ ఇక్కడున్న కుటుంబ సభ్యుల్లో ఆందోళన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పశ్చిమాసియాలోని ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు ఉపాధి నిమిత్తం వెళ్లిన తెలంగాణవాసులు సేఫ్‌గా ఉన్నట్లు సమాచారం. ఇక్కడున్న వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయితే ఇజ్రాయెల్‌లో పనిచేస్తున్న నిజామాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారు తమ కుటుంబ సభ్యులు, బంధువులకు ఫోన్లు చేసి తమ క్షేమసమాచారాన్ని అందించారు. అయినప్పటికీ వరుసగా చోటుచేసుకుంటున్న పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడున్న వారిలో ఆందోళన నెలకొంది. ఇజ్రాయెల్‌పై ఆదివారం ఇరాన్ 185 డ్రోన్లు, 110 బాలిస్టిక్ మిస్సైల్స్, 36 క్రూయిజ్ మిస్సైల్స్‌ను ప్రయోగించింది. మధ్యధరా సముద్రంలోని యూఎస్, యూకే, ఫ్రాన్స్, జోర్డాన్ దళాలు అడ్డుకుంటున్నాయి. అదేవిధంగా ఐరన్ డోమ్, ఐరన్ బీమ్(లేజర్ టెక్నాలజీ)లతో ఆయా మిసైల్స్‌ను ఇజ్రాయెల్ తమ భూభాగంలో పడకుండా అడ్డుకుంటోంది. దాదాపు 95 శాతం మిసైల్స్‌ను ఇజ్రాయెల్ నిర్వీర్యం చేసింది. అయితే శనివారం 17 మంది భారతీయులు ఉన్న సౌకను ఇరాన్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. దీంతో అలజడి నెలకొంది. ఇజ్రాయెల్‌లో సుమారు 25వేల మంది భారతీయులు ఉండగా, వెయ్యి మంది వరకు తెలంగాణ వారున్నారు. వీరిలో ఎక్కువగా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలవారున్నారు. టెల్అవీవ్ నగరంలో మనవాళ్లు ఎక్కువగా ఉంటున్నారు. ఇప్పటికే అక్కడి పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. ఇక భారత ప్రభుత్వం సైతం ఇజ్రాయెల్, ఇరాన్‌లకు వెళ్లొద్దని నోటిఫికేషన్ ఇచ్చింది. ఇదిలా ఉండగా ప్రస్తుతానికి యుద్ధం ఆగినట్లు, యుద్ధ వాతావరణం సమసిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటివరకు మనవాళ్లు సేఫ్‌గా ఉన్నారు. దీంతో ఇక్కడున్న వారి కుటుంబ సభ్యుల్లో ఉత్కంఠ కొంతమేర తగ్గింది.

క్లుప్తంగా

కొత్త మొక్కలను నాటేందుకు తీర్మానం

సాక్షి ఎఫెక్ట్..

నస్రుల్లాబాద్ (బాన్సువాడ) : 'ప్రకృతి వనాలపై వట్టింపేది' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురించగా రామాలయం కమిటీ సభ్యులు స్పందించారు. నస్రుల్లాబాద్ రామాలయంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో నరికేసిన మొక్కలను ఎంపీడీవో నీలావతి ఆదివారం పరిశీలించారు. ప్రకృతివనంలో కోనో కార్పస్ మొక్కలు ఉన్నాయని అందుకే వాటిని తొలగించామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలపగా, పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని పేర్కొనగా అదే స్థలంలో ఎనిమిది అడుగుల కొత్త మొక్కలను నాటుతామని కమిటీ తీర్మానం చేసి ఎంపీడీవోకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రాము, పంచాయతి కార్యదర్శి రాజేష్, ఆలయ కమిటి సభ్యులు తదితరులున్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ సీనియర్ నేత



కామారెడ్డి టౌన్ : బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నేత రమేశ్ గుప్తా ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం బీజేపీ పార్టీలో చేరారు. ఆంధోల్ నియోజకవర్గం టెక్మల్‌లో జరిగిన కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కే వెంకట రమణ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరుణ తార, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, మాల్యాద్రి రెడ్డి తదితరులున్నారు.

మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ

కామారెడ్డి అర్బన్ : బీజేపీ ప్రభుత్వం వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడుతామని హామీలిచ్చి మాదిగలను మోసం చేసిందని మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న ఆరోపించారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకుడు చిట్యాల సాయన్న మాట్లాడుతూ మాదిగలకు వర్గీకరణతోనే న్యాయం జరుతుందని, బీజేపీ పదేపదే మోసం చేయడం విచారకరమన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



మాచారెడ్డి : మండలంలోని మర్రి తండాకు చెందిన పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నౌసిలాల్, నాయకులు శ్రీనివాస్, గణేష్ నాయక్, సదార్, గణేష్, దేవుసింగ్, ప్రవీణ్ ఉన్నారు.

ఎర్ర జెండాలు ఇంకెన్నాళ్లు..?



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ పట్టణ నడిబొడ్డున బస్టాండ్‌లోకి వెళ్లే దారిలో కల్వర్టుపై గుంత ఏర్పడింది. ప్రతిరోజు వందలాది బస్సులు ఈ కల్వర్టు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతపడి నెలలు గడుస్తున్నా అధికారులు మరమ్మత్తులు చేపట్టడం లేదు. ప్రమాదాల నివారణ కోసం ఎర్రజెండా కట్టి చేతులు దులుపుకున్నారు. అత్యవసరం ఉన్న చోట్ల కూడా కనీస మరమ్మతులు చేయించకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మండల కమిటీలు లేకుండానే ఎన్నికలు

- జిల్లా కబడ్డీ అసోసియేషన్‌లో గందరగోళం
- ఎలక్షన్ నోటిఫికేషన్‌పై పెదవి విరుస్తున్న సీనియర్ క్రీడాకారులు

కబడ్డీ అసోసియేషన్ మండల కమిటీలు లేకుండానే జిల్లా కమిటీకి ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడం సర్వత్రాచర్చనీయాంశమైంది. జిల్లా కమిటీ ఎన్నికల్లో మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు ఓటు హక్కు వినియోగించుకుంటారు. మండల కమిటీలు వేయకుండా జిల్లా కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ ఎలా విడుదల చేశారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిజామాబాద్‌నాగారం: క్రమశిక్షణకు మారుపేరైన క్రీడారంగం ఏకఛత్రాధిపత్యానికి, నిర్లక్ష్యానికి మారుపేరుగా మారుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏళ్లుగా క్రీడా సంఘాల ఎన్నికలను తూతూమంత్రంగా నిర్వహిస్తూ పాతవారినే అధ్యక్ష, కార్యదర్శులుగా కొనసాగిస్తున్నారని క్రీడాభిమానులు ఆరోపిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా ఏళ్ల తరబడిగా ఆధిపత్యం కొనసాగించడం మామూలు విషయంగా మారింది. తమకు అవకాశం దక్కడం లేదని సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక నోటిఫికేషన్‌ను ఈనెల 12వ తేదీన విడుదల చేశారు. మే 5న జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని కార్యదర్శి లింగన్న జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించాలంటే మండల కమిటీలు వేయాల్సి ఉంటుంది. అయితే, గత కొన్నేళ్లుగా జిల్లాలో ఎక్కడా మండల కమిటీలు వేసిన దాఖలాలు లేవు. ఆయా గ్రామాలకు చెందిన సీనియర్ క్రీడాకారులు, క్లబ్‌లతో మండల కమిటీ వేయాల్సి ఉండగా ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదు.



ఓటరు జాబితా ఎలా రూపొందిస్తారు?

కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఓటరు జాబితాను ఎలా రూపొందిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారిని సైతం నియమించారు. జిల్లా కమిటీని ఎన్నుకునేందుకు మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు ఓటు వేయాల్సి ఉంటుంది. ఒకవేళ మండల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అందుబాటులో లేకుంటే వారి అనుమతి మేరకు కార్యవర్గంలో ఎవరైనా ఓటు వేసే అవకాశం ఉంటుంది. అయితే, మండల కమిటీలు లేకుండా ఓటరు జాబితా ఎలా రూపొందిస్తారు? జిల్లా కమిటీని ఎలా ఎన్నుకుంటారని క్రీడాకారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఏం చేస్తారో?

కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి పరిశీలకులుగా రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నుంచి ఒకరు వస్తారు. అలాగే జిల్లా ఒలింపిక్ సంఘం, స్పోర్ట్స్ అథారిటీ అధికారి సైతం ఎన్నిక ప్రక్రియను పరిశీలిస్తారు. సదరు అధికారులు ఓటరు జాబితాను పరిశీలించాల్సి ఉంటుంది. మండల కమిటీలు లేకుండా రూపొందించే జాబితాను ఆమోదిస్తారా? లేక అభ్యంతరం తెలుపుతారా? అనేది చర్చనీయాంశమైంది.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్

తాడ్వాయి: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. జిల్లా మహావీర్ సేన ఆధ్వర్యంలో తాడ్వాయిలో ఆదివారం నిర్వహించిన జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. ఏదో ఒక ఆటలో భాగమైతే ఆరోగ్యంగా ఉంటారన్నారు. మూడు రోజుల పాటు జరిగిన కబడ్డీ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన బంజపల్లి జట్టుకు రూ.50 వేలు, రెండో స్థానంలో నిలిచిన పిట్లం జట్టుకు రూ.25వేలు, మూడో స్థానంలో నిలిచిన కోనాపూర్ జట్టుకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో మహావీర్ సేన జిల్లా అధ్యక్షుడు బంగ్లా చైతన్యగౌడ్, బాల్‌రాజు, రమేశ్‌రెడ్డి, ప్రీతం, రాజు పాల్గొన్నారు.



ఫైనల్‌లో తలపడుతున్న పిట్లం, బంజపల్లి జట్లు

సీసీరోడ్డు పోయి.. మట్టిరోడ్డు వచ్చే..

రామారెడ్డి : ఈ చిత్రంలో కనిపిస్తున్న మట్టి రోడ్డు కింద సీసీ రోడ్డు ఉంది. 15 ఏళ్ల క్రితం రోడ్డును సీసీ చేశారు. ఈ రోడ్డుకు ఓవైపు ఇసన్నపల్లి గ్రామం మరోవైపు రామారెడ్డి గ్రామాలు ఉంటాయి. హనుమాన్ గుడి నుంచి మున్నూరు కాపు సంఘం వరకు 500 మీటర్ల దూరం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సీసీ రోడ్డు పూర్తిగా గుంతలు పడి శిథిలావస్థకు చేరడంతో గత వినాయక చవితి సందర్భంగా అప్పటి జీపీ పాలకవర్గాలు మొరం పోయించారు. ఈ సీసీ రోడ్డు మీద పోసిన మొరం రోడ్డుపై నుంచి దొక్కల్ వయా నిజామాబాద్ వరకు ఆర్టీసీ బస్సు, వాహనాల రద్దీ బాగానే ఉంటుంది. గతంలో కూడా రెండు మూడు సార్లు సీసీ రోడ్డుపై మొరం పోయించారు. తీరా ఇప్పుడు సీసీ రోడ్డు ఆనవాళ్లు పూర్తిగా మాయమైంది. సీసీ రోడ్డు నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్ (క్యూసి) 75% నుంచి 85% వరకు ఉండకపోవడం, క్యూరింగ్ లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతోనే అనతి కాలంలోనే సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వర్షాకాలంలో ఈ మొరం రోడ్డుతో కూడా ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ మట్టి రోడ్డు కింద సీసీ రోడ్డు ఉందని చాలా మందికి గ్రామస్తులకే తెలియకపోవడం గమనార్హం.



ఇసన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య సీసీ రోడ్డుపై పోసిన మొరం

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు





బాధిత కుటుంబాలను ఓదారుస్తున్న వినయ్‌రెడ్డి, నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రెడ్డి

- ముగ్గురు యువకులకు అంతిమవీడ్కోలు
- ఒడ్యాట్‌పల్లిలో అలుముకున్న విషాదఛాయలు

మాక్లూర్: చెరువులో మునిగి మృతి చెందిన ముగ్గురు యువకులకు మండలంలోని ఒడ్యాట్‌పల్లిలో అశ్రునయనాల మధ్య అంతిమవీడ్కోలు పలికారు. తిరుపతి, నరేశ్, మహేశ్ అంత్యక్రియలను ఆదివారం నిర్వహించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కాంగ్రెస్‌పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ గోవూరి ఒడ్డెన్న తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబాలను ఓదార్చి ధైర్యం చెప్పారు. ముగ్గురి మృతదేహాలను వరుసగా తీసుకెళ్తున్న దృశ్యాన్ని చూస్తూ గ్రామస్తులు కంటతడి పెట్టారు.

అధికారులే కారణం..

ఒడ్యాట్‌పల్లి చెరువులో మొరం త్వడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, ముగ్గురు యువకుల మృతికి అధికారులే కారణమని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ ఆరోపించారు. ఆదివారం ఆయన ఒడ్యాట్‌పల్లిలో విలేకరులతో మాట్లాడారు. ముగ్గురి మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఒక్కో బాధిత కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ఏఆర్ కానిస్టేబుల్ హల్‌చల్

- మద్యం మత్తులో దాడికి యత్నం
- పోలీస్ కమిషనర్ కార్యాలయం ఎదుటే ఘటన

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో ఏఆర్ కానిస్టేబుల్ పోలీస్ కమిషనర్ కార్యాలయం ఎదుటే హల్‌చల్ చేశాడు. ఆదివారం రాత్రి నగరంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఏఆర్ కానిస్టేబుల్ ఆయూబ్ స్కూటీపై వెళ్తుండగా అటువైపుగా ఓ ఫ్యామిలీ కారులో వెళ్తోంది. ఈక్రమంలో స్కూటీని కారు స్వల్పంగా ఢీకొంది. దీంతో, తన స్కూటీని కారు ఢీకొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయూబ్ కారును ఆపి డ్రైవర్ సీటులో ఉన్న వ్యక్తి నుంచి బలవంతంగా ఆర్‌సీ లాక్కున్నాడు. కారులో ఉన్న మహిళలు కానిస్టేబుల్‌ను బతిమాలినప్పటికీ వినిపించుకోకుండా, దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి యత్నించాడు. సీపీ కార్యాలయం ఎదుటే అరగంటపాటు ఈ తతంగం కొనసాగినప్పటికీ అక్కడి పోలీసులు పట్టించుకోలేదు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు వాహనాన్ని ఆపి ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఏఆర్ కానిస్టేబుల్ ఆయూబ్ నుంచి ఆర్‌సీ తీసుకొని కారులో ఉన్న వారికి ఇచ్చారు. అక్కడి నుంచి కానిస్టేబుల్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయించగా, మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యిందని ఎస్‌హెచ్‌వో తెలిపారు. బాధితులు ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.





మహమ్మద్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

బాల్కొండ మండల కేంద్రంలో..

గుర్తుకొస్తున్నాయి..



ఎడపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో..

ఎడపల్లి/బాల్కొండ/నిజాంసాగర్: పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాలు నాటి జ్ఞాపకాలకు వేదికలయ్యాయి. దశాబ్దాల తరువాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ప్రేమను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఎడపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 1983 నుంచి 1993 వరకు పదోతరగతి చదివిన విద్యార్థులు 150 మంది పాల్గొన్నారు. మహమ్మద్‌నగర్ మండలం కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 1989 – 90 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1998 – 99 బ్యాచ్) పాండురంగ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

కార్యకర్తలే నా బలం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): తన గెలుపుకు కార్యకర్తలే బలం బలగం అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని జీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. త్వరలో జరగబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీబీపాటిల్ ఎంపీగా చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కర్రలతో పరస్పర దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని సారంగాపూర్ ప్రాంతంలో ఉన్న భవానీ హోటల్ వద్ద రెండు వర్గాలు కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. భవానీ దాబా వద్ద అజ్జు అనే వ్యక్తి నిలబడి ఉండగా ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఆరుగురు వ్యక్తులు దాడి చేశారు. గతంలో ఇద్దరు రౌడీషీటర్లు మృతి చెందగా, వారి అనుచరుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అజ్జుపై దాడికి పాల్పడిన వారు అంజాద్‌భాయ్ దాడి చేయమని చెప్పడంతోనే.. దాడి చేసినట్లు తెలిపారు. దీంతో అంజాద్ ఇంటికి అజ్జు దాడికి వెళ్లాడు. ఆ తరువాత రెండు వర్గాలు కర్రలతో కొట్టుకున్నారు. ఈ ఘటనపై ఆరా తీస్తున్న పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

విద్యుత్ స్తంభానికి మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఖలీల్‌వాడి: షార్ట్ సర్క్యూట్ కారణంగా నగరంలోని తిలక్‌గార్డెన్ ప్రాంతంలో ఇనుప స్తంభంపై మంటలు చెలరేగాయి. స్తంభానికి వైర్లు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో షార్ట్‌సర్క్యూట్ అయ్యిందని స్థానికులు భావిస్తున్నారు. మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురై ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. విద్యుత్‌శాఖ ఏడీ తోట రాజశేఖర్ విద్యుత్ సరఫరాను నిలిపివేయించి మరమ్మతులు చేయించారు.

'హరితహారం'పై గొడ్డలివేటు



తిర్మలాపూర్ గ్రామంలో నరికివేతకు గురైన హరితహారం చెట్లు



తాడ్కోల్ డబుల్‌బెడ్‌రూం రోడ్డులో..

బాన్సువాడ రూరల్ : హరితహారం లక్ష్యాన్ని పూర్తిచేయడానికి నాలుగైదేళ్ల క్రితం అధికారులు ఎక్కడపడితే అక్కడ మొక్కలు నాటించారు. వాటికి చుట్టూ జాలీలు కట్టించి, ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి పెంచారు. తీరా అవి పెరిగి పెద్దవి కాగానే విద్యుత్ తీగల కింద ఉన్నాయనే కారణంతో నరికివేస్తున్నారు. దీంతో విలువైన ప్రజాధనం వృథా అవుతోంది. నాటు ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటే సమయంలోనే విద్యుత్ తీగల కింద నాటకుండా ఉంటే నేడు ఈ పరిస్థితి ఉండేది కాదని గ్రామస్తులు సూచిస్తున్నారు.

మండలంలోని తిర్మలాపూర్, తాడ్కోల్ డబుల్ బెడ్‌రూం కాలనీ రోడ్లలో పదుల సంఖ్యలో మొక్కలు నరికివేతకు గురయ్యాయి. అధికారుల్లో ఎలాంటి పశ్చాత్తాపం కన్పించకపోవడం బాధాకరం.

ఫరీదుపేట వాసికి జాతీయ ఉగాది పురస్కారం



కళా ప్రదర్శన ఇస్తున్న దేవాగౌడ్

మాచారెడ్డి : పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన జానపద కళాకారుడు కర్రోల్ల దేవాగౌడ్‌కు మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ ఆధ్వర్యంలో ఉగాది జాతీయ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం ఆన్ లైన్ ద్వారా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు దేవాగౌడ్ సాక్షికి తెలిపారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించిన ఆ సంస్థ వారు దేవాగౌడ్ ను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

చౌకి రాజేంద్రకు..

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి గంజ్ ఉన్నత పాఠశాల భాషోపాధ్యాయుడు చౌకి రాజేంద్రకు ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో పద్య సారస్వత పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనం-శ్రీరామాయణభానువు గ్రంథావిష్కరణ కార్యక్రమంలో రాజేంద్రకు జ్ఞాపిక, శాలువతో సత్కారం, శ్రీరామాయణ పుస్తకంతో పాటు ఉగాది సత్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పద్య సారస్వత పీఠం అధ్యక్షుడు దత్తన్న, సీనియర్ ప్రాతికేయులు రావికంటి శ్రీనివాస్, ఆకెళ్ల రాఘవేంద్ర, రావుల గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని వజ్జపల్లిలో రాజరాజేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రం నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ ప్రభాకర్ రావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రామారావు, సాకలి శ్రీనివాస్, గాదె చిన్నన్న, ప్రభాకర్ రావు, కమలాకర్ రావు, హరీశ్ రావు, శివ, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- నాళేశ్వర్ వాగు నుంచి రాత్రి వేళల్లో తరలింపు
- వీడీసీ, అధికారుల అండతో ఇష్టారాజ్యం

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి రాత్రి వేళల్లో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు సుమారు 50 నుంచి 60 మంది గ్రూపుగా ఏర్పడి ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారని పలువురు పేర్కొన్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు వీడీసీకి చెల్లించిన ట్రాక్టర్ యజమానులు పోలీసు, రెవెన్యూ యంత్రాంగానికి ముడుపులు చెల్లిస్తూ ఇష్టానుసారంగా ఇసుకను తవ్వేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నాళేశ్వర్ నుంచి నవీపేట, బాసర, నందిపేట, నిజామాబాద్ తదితర ప్రాంతాల వైపు ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇటీవల నామ్‌కే వాస్తేగా దాడులు చేసిన పోలీసులు రెండు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి చేతులు దుపులుపుకున్నారు. అయినప్పటికీ ఇసుక అక్రమరవాణాలో జోరు తగ్గలేదు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతుతున్నారు.

క్రైం కార్నర్

మైనర్ల ప్రేమ వివాహం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్లు ప్రేమ వివాహం చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ ఆదివారం తెలిపారు. ఇంటర్ చదువుతున్న ఒకే గ్రామానికి చెందిన మైనర్లు ప్రేమించుకున్నారు. బాలిక ప్రవర్తనను గమనించిన తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి చేయాలని నిర్ణయించారు. దీంతో ఇరువురు ఇళ్ల నుంచి బయటికి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇరువురి ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



ఎడపల్లి (బోధన్): మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో కొద్దిరోజుల క్రితం చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చిన వ్యక్తి స్థానిక బాలత్రిపురదేవి ఆలయంతో పాటు మరో ఆలయంలో సుమారు రూ.26వేలు చోరీకి పాల్పడ్డాడన్నారు.